క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

మామిడికుదురు/అంబాజీపేట: అమలాపురంలో ఈ నెల 26న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో దాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరం, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటికి తాళం వేసి ఊరెళితే...

కొత్తపేట: ఇంటికి తాళం వేసి ఊరెళితే ఇంట్లో దాచుకున్న డబ్బు దొంగలు దోచుకుపోయారు. ఈ చోరీకి సంబంధించి స్థానిక ఎస్సై వి.మణికుమార్ కథనం మేరకు స్థానిక మెయిన్‌రోడ్డులో బిర్యాని పాయింట్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న బూల వినయ్ స్థానిక గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం ఈ నెల 21న ఉదయం రాజమహేంద్రవరం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి వెనుక తలుపు తీసి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా దాంట్లో భద్రపర్చుకున్న సుమారు రూ.30 వేలు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. దానితో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై మణికుమార్ వెళ్లి పరిశీలించారు. కాకినాడ నుంచి క్లూస్ టీంను రప్పించగా ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేపు కుమ్మర శాలివాహన జిల్లా స్థాయి సమావేశం

అంబాజీపేట: కుమ్మర శాలివాహన జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 25న మాచవరం కుమ్మర శాలివాహన సంఘ భవనం వద్ద నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న 22 మండలాల కుమ్మర శాలివాహన సోదర, సోదరీమణులంతా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. నూతనంగా జిల్లా ఏర్పడిన నేపథ్యంలో సంఘ బలోపేతం తదితర అంశాలపై సమావేశం జరుగుతుందన్నారు.

బీజామృతంతో తెగుళ్ల నివారణ

అంబాజీపేట: బీజామృతంతో నారు శుద్ధి చేయడం వల్ల భూమి నుంచి సంక్రమించే తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ నాగవరపు శ్రీనివాసరావు అన్నారు. పుల్లేటికుర్రులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతం తయారు చేసి ఆదివారం రైతులకు అందించారు. నాగమణి మాట్లాడుతూ విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లను బీజామృతంతో అరికట్టవచ్చన్నారు. వరి నాట్లు వేసే ముందు నారు కొనలు తుంచి నాటడం వల్ల కాండం తొలిచే పురుగుగుడ్ల సముదాయాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్ కుడుపూడి లక్ష్మీదుర్గ, పి.సత్యమణి, సీహెచ్ దామోదరరావు, పి.విజయకుమారి రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పి.గన్నవరం: గ్రామంలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పసలపూడి రామకృష్ణ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అంబాజీపేట ఉషా డయాబెటిక్ అండ్ జనరల్ కేర్ క్లినిక్‌కి చెందిన వైద్య నిపుణులు డీవీ సత్యం, రేణుకల ఆధ్వర్యంలో సిబ్బంది పలువురికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు గనిశెట్టి శ్రీను, ఈశ్వర్, లంకే చిరంజీవి, వేమన గంగాధర్, కామాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రాజోలు: మండలంలోని పొదలాడలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ ఆధ్వర్యంలో పొదలాడ పంచాయతీ, రామాలయం పరిసర ప్రాంతాల్లో భగవద్గీతలను పంపిణీ చేశారు. అభిమన్యురాజు, సుబ్బారావు, బ్రహ్మాజీ, అప్పారావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

పి.గన్నవరం: గ్రామంలో పనిచేస్తున్న పల్లేరు వారిపేటకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్‌ఏ) పల్లేరు వెంకటరత్నం (48) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సాయాన్ని అందించారు. ఏసు మృతదేహానికి డీటీ బి.గోపాలకృష్ణ, ఇన్‌చార్జి ఆర్‌ఐ పి.నర్సింహరావు, మండలంలోని వీఆర్వోలు, వీఆర్‌ఏలు నివాళులు అర్పించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: ఇరుసుమండ ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన పిల్లా వెంకటరత్నం తన స్కూటీపై బ్రాహ్మణ వీధి లోంచి ప్రధాన రహదారిపైకి వస్తున్నాడు. అదే సమయంలో అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బలంగా ఢీకొట్టింది. దాంతో వెంకటరత్నంకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు

- ఫ్యామిలీ డాక్టర్‌తో సత్ఫలితాలు
- వైద్య సేవలకు నీరాజనం



బి.దొడ్డవరంలో రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వర్ణలత

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యం అందించాలన్న దృఢ సంకల్పంతో ప్రవేశ పెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. దీని ద్వారా ప్రతి గ్రామంలోనూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వైద్య సేవలందిస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వ డాక్టర్‌తో పాటు సిబ్బంది 104 వాహనం ద్వారా వచ్చి వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నారు. గతంలో ప్రభుత్వ వైద్య సేవల కోసం పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. సుదూరం ప్రాంతం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం ప్రజలకు భారంగా ఉండేది. దాని వల్ల రోగులు ప్రభుత్వాస్పత్రులకు వెళ్లేందుకు మక్కువ చూపేవారు కాదు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.



దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మంచానికి పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఉదయం 104 వాహనం వద్ద వైద్య సేవలందిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా అందించిన సేవలు

సేవలు పొందిన రోగులు	చేసిన టెస్టులు	గర్భిణులు	ఇంటి దగ్గర వైద్యం పొందిన వారు
పి.గన్నవరం నియోజకవర్గం...			
84,389	35,355	3,579	419
రాజోలు నియోజకవర్గం...			
95,543	33,020	3,954	513
కొత్తపేట నియోజకవర్గం...			
1,03519	43151	4212	614

మధ్యాహ్నం సమయంలో మంచం పట్టిన రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నేటి వరకు నియోజకవర్గాల వారీగా సేవలు పొందిన వారి వివరాలు, క్యాంపులను పరిశీలిద్దాం.

నాకు అండగా ఉంటున్నారు



గతంలో ప్రభుత్వ వైద్య సేవలు పొందాలంటే సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ఇంటికి సమీపంలోనే వైద్య సేవలందిస్తున్నారు. నెలకు రెండు సార్లు డాక్టర్ మా ప్రాంతానికి వస్తున్నారు. నాకు బీపీ, సుగరు వంటి సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలకు సంబంధించి ప్రతి నెలా డాక్టర్‌కు చూపించుకుని ఉచితంగా మందులు తీసుకుంటున్నాను.

– పితాని మహాలక్ష్మి, బి.దొడ్డవరం

మంచి సేవలందిస్తున్నారు



ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికి వచ్చి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు మా గ్రామానికి వస్తున్నారో ముందుగానే మాకు సమాచారం అందిస్తున్నారు. అదే రోజు మేము అక్కడకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.

– బత్తుల సావిత్రి, ఆదుర్రు

మందులు ఉచితంగా ఇస్తున్నారు



గతంలో బీపీ, సుగర్ మందులు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు నెలలో రెండు సార్లు సచివాలయం వద్ద మెడికల్ క్యాంపులు పెట్టి మాకు అందుబాటులో ఉండేలా డాక్టర్లు వస్తున్నారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి కావాల్సిన మందులు ఉచితంగా ఇస్తున్నారు. అవసరమైతే వైద్య సిబ్బంది ఇంటికి వచ్చి మరీ వైద్యం చేస్తున్నారు.

– పోలవరపు సత్యనారాయణ, రావులపాలెం

ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా..



ర్యాలి శ్మశాన వాటిక

ఆత్రేయపురం: ఎంత సుందరంగా ఉంది ఈ భవన నిర్మాణం. అదేదో గొప్ప ధనవంతుల భవంతి అనుకుంటే పొరపాటే. ధనిక, పేద తారతమ్యం లేదు. కులాల రొంపి అంతకంటే లేదు. బొందలో ప్రాణం ఆగిన తరువాత ఎవరైనా సరే చేరుకునే చివరి మజిలీ.. అదే శ్మశాన వాటిక. ఆత్రేయపురం మండలం ర్యాలిలో సరైన శ్మశానవాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే రాజమహేంద్రవరం కైలాస భూమికి తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఈ సమస్యను అధిగమించేందుకు గ్రామస్తులంతా ఒకటయ్యారు. అందరి సహకారంతో రూ.40 లక్షలతో అందమైన కైలాస భూమిగా తీర్చి దిద్ది ఎన్నో గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ కైలాస భూమిలో రెండు శవ దహన పేటికలు, జల్లుస్నాన సదుపాయం, కూర్చునేందుకు ప్రత్యేక గదులు, ఇలా ఎన్నో సదుపాయాలు కల్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలమూరులోనే కొనసాగుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎక్కడకి తరలిపోదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఆలమూరులో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ చల్లా ప్రభాకరరావు స్వగృహం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అమలాపురం తరలించే ప్రసక్తే లేదని వెల్లడించారు. సంక్షేమ, అభివృద్ధి నిరోధకులైన ప్రతిపక్షాలు ఆరోపణలు, అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందంటూ విద్యాశాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి నిలిపి వేయించామన్నారు. డిగ్రీ కళాశాల యథావిధిగా నడుస్తుందని భరోసా ఇచ్చారు. కళాశాల అభివృద్ధికి ప్రజలంతా తమ వంతు సహకారం అందించాలన్నారు. అలాగే గతంలో తన తండ్రి దివంగత చిర్ల సోమసుందరరెడ్డి హయాంలో కొత్తపేట విద్యుత్ డిప్యూటీ ఇంజినీర్ కార్యాలయం తరలింపు నిలిపివేశామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ కార్యాలయాన్ని అమలాపురం తరలించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని కొత్తపేటలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పార్టీ గ్రామ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, మీడియా కోఆర్డినేటర్ చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద



అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద తగ్గిన వరద



కనకాయలంక కాజ్ వే వద్ద వరద ఉధృతి



టేకిశెట్టిపాలెం కొత్త కాజ్ వే వద్ద అగ్నికుల క్షత్రియ కాలనీకి పోటెత్తుతున్న వరద నీరు

పి.గన్నవరం: వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. బూరుగులంక రేవులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంజిన్‌బోట్లపై రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలు బయటకు రావడానికి పడవలను ఆశ్రయిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కాజ్‌వేపై ఐదడుగుల ఎత్తున వరద ప్రవహిస్తుండటంతో ప్రజలు పడవలపై చాకలిపాలేనికి వస్తున్నారు. ఆదివారం కావడంతో వరద ఉధృతిని తిలకించేందుకు పలు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అగ్నికుల క్షత్రియ కాలనీకి వరద నీరు

సఖినేటిపల్లి: గోదావరి వరద ప్రవాహం ఆదివారం సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి టేకిశెట్టిపాలెం దిగువ వరకూ గోదావరి పాయను చేరి ఉన్న లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతోంది. ప్రధానంగా కొబ్బరి తోటలు ఇప్పటికే జలమయమయ్యాయి. టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువ నుంచి అప్పనరామునిలంక గ్రామానికి వెళ్లే మార్గంలోని గోదావరి పాయ(బాడి కాలువ)పై కొత్తగా ఇటీవల నిర్మించిన కాజ్ వే వద్ద వరద నీరు ప్రవహిస్తోంది. గోదావరి పాయకు చేరి టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీ ఇళ్ల వద్ద వరద పోటెత్తుతోంది. వీటితో పాటు అప్పనరామునిలంక గ్రామ శివారు కొత్తలంకలోని నెహ్రూ సీసీఎఫ్ సొసైటీ భూముల్లోకి వరద చేరుతోంది.

నిలకడగా వరద గోదావరి

రావులపాలెం: మండలంలోని గౌతమి, వశిష్ట గోదావరుల్లో వరద నీటి ప్రవాహం నిలకడగా సాగుతుంది. గత నాలుగు రోజుగా ఉధృతంగా సాగిన గోదావరి ప్రవాహం ఆదివారం ఉదయాన్ని తగ్గుముఖం పట్టింది. ఉదయం నుంచి నిలకడగా ప్రవాహం సాగుతుందని రైతులు అంటున్నారు. మండలంలోని లంక పొలాలకు ప్రస్తుతానికి ఎటువంటి ముప్పు లేకపోవడంతో రైతులు దిగువ లంక పొలాలల్లో నీట మునిగిన కొద్దిపాటి పంటలను నావలపై వెళ్లి ఒబిడి చేసుకుంటున్నారు.

శాంతించిన గోదావరి

అయినవిల్లి: గోదావరి శాంతించింది. రెండు రోజులుగా లంక గ్రామాలను వరద చుట్టిముట్టిన విషయం తెలిసిందే. ముక్తేశ్వరం వృద్ధ గౌతమి, అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద వరద తగ్గుముఖం పట్టింది. కాజ్‌వేపై యథావిధిగా రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో లంక ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

అప్పనపల్లిని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తాం



అప్పనపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: బాల బాలాజీ స్వామి కొలువు తీరిన అప్పనపల్లి గ్రామాన్ని ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు అందించిన రూ.5 లక్షల విరాళంతో గోకులం, మద్దుల పుల్లేశ్వరగుప్తా-సావిత్రి దంపతులు అందించిన రూ.3 లక్షలతో నిర్మించే శయన మందిరం, రూ.4 లక్షలతో నిర్మించే యాగశాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ దాతల సహకారంతో బాలాజీ ఆలయం దిన దిన ప్రవర్ధమానంగా వెలుగొందుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ గ్రంధి మాధవి, సర్పంచ్‌లు గెడ్డం మంగాలక్ష్మి, అడబాల తాతకాపు, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బత్తుల గంగారత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాము, గెడ్డం వెంకటేశ్వరరావు, అర్చకులు, ఆలయ ఉద్యోగులు, దాతలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులంకలో నక్కా సత్యనారాయణకు చెందిన భూవివాదంలో ఉన్న భూమిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. కొండుకుదురు లంకకు చెందిన నక్కా సత్యనారాయణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు తనకు అన్యాయం చేశారంటూ ఫిర్యాదు చేశారు. భూ వివాదంలో ఉన్న వాస్తవాలను నక్కా సత్యనారాయణను అడిగి విక్టర్ ప్రసాద్ తెలుసుకున్నారు. స్థానిక విలేకరులలో విక్టర్ ప్రసాద్ మాట్లాడారు. 2012లో సత్యనారాయణ అవసరం మేరకు ఫ్రెంచి యానాంకు చెందిన బంగారు వెంకటకేథార్ నాథ్ వద్ద 2.92 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.12 లక్షల అప్పు తీసుకున్నాడన్నారు. ఈ భూమికి సంబంధించి కేథార్‌నాథ్ సేల్ డీడ్ రాయించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. సత్యనారాయణ అభ్యర్థన మేరకు ఈ భూమిని పరిశీలించడానికి వాస్తవాలను తెలుసుకోవాడానికి తాను వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, సీఐ ప్రశాంత్‌కుమార్, స్థానిక ఎస్సై తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆలమూరు, మాచవరం, మేడిచర్లపాలేల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిర్ల, కొండేటి, రాపాక



మేడిచర్లపాలెంలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆలమూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆలమూరులో ఏడో విడత గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల మేరకు ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల తమకు కలిగిన లబ్ధిని ఆయన ఇంటింటికి వెళ్లి గణాంకాలతో సహా వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల కోవిడ్ సమయంలో ప్రజలకు కలిగిన మేలును, గ్రామ వలంటీర్లు అందించిన సేవలను ప్రజలకు వివరించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని జగ్గిరెడ్డి కోరారు. గ్రామంలో ఇప్పటికే కాపుకల్యాణ మండపం, శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు నవరత్నాల వల్ల రికార్డు స్థాయిలో రూ.20 కోట్ల లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోరాటి సీతామహలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, సర్పంచ్ వనుం చిన్నావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ వసంతం

అంబాజీపేట: సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యాన గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ జవాబుదారీగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను, కుసుమ వరలక్ష్మి, ఉందుర్తి నాగబాబు, కాండ్రేగుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

మలికిపురం: రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని మేడిచర్లపాలెంలో జరిగిన గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష్యాలను విమర్శిస్తున్న ప్రతి పక్షాలకు పార్టీ కార్యకర్తలు దీటుగా సమాధానం ఇవ్వాలని అన్నారు. గతంతో ఎన్నడూ లేని విధంగా సాగుతున్న విప్లవాత్మక పాలనను చూసి ఓర్వ లేక ప్రతి పక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో అల్లూరి మాధవవర్మ, మేడిచర్ల వెంకటేశ్వరరావు, గుబ్బల పుల్లయ్య, కానూరి బాబి, చింతా రాజబాబు, రొక్కాల వెంకట్, దూది సాయిబాబు, మల్లిపూడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఐ.శుభాకర్ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో నృత్య నీరాజనం



నర్తనోత్సవంలో పాల్గొన్న చిన్నారులతో ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం విజయవాడకు చెందిన మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యాన అకాడమీ శిష్యబృందంతో నర్తనోత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనృసింహుని పాదపద్మాలకు సమర్పించే నృత్య నీరాజనమే ఈ నర్తనోత్సవం. తొలుత ఆర్గనైజర్స్ నందిరాజు అరుణ కళ్యాణి, ఎన్ఎస్ఎన్ కృష్ణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. సుమారు 120 మంది చిన్నారులు స్వామిని కీర్తిస్తూ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. దేవస్థానం తరఫున వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. సూపరింటెండెంట్ పి.విజయసారథి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులై పలువురు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆదివారం ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం వద్ద గోపాలపురంలో జరిగిన కార్యక్రమంలో రావులపాలెం మండలంలోని దేవరపల్లి గ్రామం మెరకపాలెంకు చెందిన పలువురు ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన విత్తనాల రాజు, గుబ్బల అర్జునరావు, గుబ్బల ఏడుకొండలు, కడలి వెంకటరావు, కడలి ధనరాజు, గుబ్బల శ్రీను, గుబ్బల వీరయ్య, కడలి శ్రీరాములు, గుబ్బల వెంకటగణేష్ లు స్థానిక పార్టీనాయకులు ఎంపీటీసీ కుడుపూడి నాగరాజు, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, అప్పారి అన్నవరం, బొక్కా శ్రీనుల ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

నేడు వాహనాలకు వేలం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ వద్ద వివిధ వాహనాలకు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ సీహెచ్ అరుణమ్మ తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనే వారు హాజరు కావాలని ఆమె కోరారు.

ఉచిత వాస్క్యులర్ వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఆదివారం ఉచిత వాస్క్యులర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం వైద్య సేవలు అందించారు. వాస్క్యులర్ సర్జన్ జీవీ ప్రవీణ్ కుమార్, న్యూరోసర్జన్ అనిల్ కుమార్ పాల్గొని, 192 మందిని పరీక్షించారు. 167 మందికి కలర్ డాప్లర్ అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించి, 140 మందికి లేజర్ ట్రీట్మెంట్‌తో ఆపరేషన్‌కి హైదరాబాద్ తీసుకు వెళ్లేందుకు ఎంపిక చేశారు. ఈనెల 26న ప్రత్యేక బస్సుల్లో వీరిని హైదరాబాద్ తీసుకువెళ్లి ఆరోగ్యశ్రీలో ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అనారోగ్య బాధితుడికి ఎమ్మెల్యే సాయం

రావులపాలెం: ఇటీవల గుండె సంబంధిత వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడుకి చెందిన అయినవిల్లి చినబాబును ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. చినబాబుకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, అడపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పి.నాగవెంకట మహేష్, హరిణి దంపతులు రూ.11,116, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.సందీప్-శాంతి దంపతులు రూ.10,116, కోరుమిల్లికి చెందిన ఎస్.రామారావు-లక్ష్మీపార్వతి దంపతులు రూ.10,116, యనమలకుదురుకి చెందిన డి.రామకిషోర్-రుక్మిణీ దంపతులు రూ.10,116, నర్సీపట్నానికి చెందిన జె.వెంకటరాజీకుమార్-రమ్య దంపతులు రూ.10,116, ఉల్లంపర్రుకు చెందిన ఎం.రఘురాంబాబు-భాగ్యలక్ష్మి రూ.10 వేలు విరాళం అందించినట్లు ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.